# రుంజ కథ

రవుంగ....రవుంగ.....రవుంగ అనే శబ్దం రుంజుగా మార్పుచెందింది. శివపురాణంలో ఈ వాద్యప్రసక్తి ఉంది. రవుంధ్రకాసురుడను రాక్షసుడిని విశ్వకర్మ సంహరించి ఆ రాక్షసునిచర్మాన్ని రుంజపై తోలుగాను, నరాలను త్రాళ్లుగాను, పళ్లను నాగవాసాలుగాను ఉపయోగించి రుంజ వాద్యాన్ని తయారుచేసెనని చెప్పబడుతోంది.

పార్వతీ కళ్యాణమప్పడు ఈ వాద్యాన్ని వాయించినట్లుగా చెప్పబడుతోంది. అంతకుముందు ఢమరకం తప్ప వేరేవాద్యాలు లేవు. రుంజు వాద్యంలో 32 వాద్యాల శబ్దాలను సృష్టించవచ్చు.



అమరావతి, శ్రీశైలం మొదలైన అన్ని శివక్షేత్రాలలో ఈ వాద్యాన్ని వాయిస్తారు.

ఈ వాద్యంపై పార్వతీ కల్యాణం, దక్షయజ్ఞం, పార్వతీ పరమేశ్వర సంవాదం, పంచముఖి ఆవిర్భావం ఇంకా యెన్నో భక్తికథలు చెబుతారు. విశ్వబ్రాహ్మలు ఈ వాద్యాన్ని యెక్కువ వాయిస్తూంటారు. రుంజకళాకారులు వార్షికంగా విశ్వబ్రాహ్మణుల ఇళ్లకు వెళ్లి పారితోషికం తెచ్చుకుంటారు. పెళ్లిళ్లకు, సంబరాలకు, అమ్మవారి జాతరలకు ఈ వాద్యంపై కథలు చెప్పిస్తూ వుంటారు.

రుంజుకథ చెప్పవారిలో నాలుగు రకాల కళాకారులున్నారు. (1) దేవాలయాలలో రుంజుకథచెప్ప వారు రుద్రాంగులనబడుతారు. (2) శివుని ఉత్సవాలలో కథచెప్ప వారిని రుద్రమహేశ్వరులంటారు. (3) ఆదిపలాసులనువారు చేతివృత్తులు చేయువారి కులంలోనివారిని పొగుడుతారు. (4) పెళ్లిళ్లకు కథలుచెప్పేవారిని జంగం వారంటారు.

రుంజ కళాకారులు రాష్ట్రంలో చాలా జిల్లాలలో ఉన్నారు. ఎక్కువగా శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, గుంటూరు, కడప, నల్గొండ జిల్లాలలో ఉన్నారు. చాల మంది కళాకారులు ఈ కళ వ్యాప్తి కై కృషి చేస్తున్నారు.